E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు    జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం :
9959812941-9949356387

PUBLISHED: TELANGANA ,JANGAON,HYDERABAD    సంపుటి :01    సంచిక :173    మంగళవారం 02 జూన్ 2026    ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్    పేజీలు: 04    వెల :05/-

### రాష్ట్రంలో మరో రెండున్నర లక్షల

# ఇందిరమ్మ ఇళ్లు

**: సీఎం రేవంత్‌రెడ్డి**


2 లో

**కాగజ్‌నగర్, తెలుగు గళం:** ఆదిలాబాద్ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆదిలాబాద్ ఆదివాసీల సొంతింటి కల నెరవేరాలని ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున పేదలకు మంజూరు చేయాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కాగజ్‌నగర్‌లో పర్యటించిన సీఎం.. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. “తండాలు, గూడేల్లో ఉండే అర్హులైన ఆదివాసీ బిడ్డల కోసం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి నూరు శాతం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి. గుడిసెలు లేని ఆదిలాబాద్ జిల్లాను నేను చూడాలనుకుంటున్నా. రాష్ట్రంలో సెప్టెంబర్ 17న మరో లక్ష గృహప్రవేశాలు చేస్తాం. కొత్తగా మరో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను ఈ వేదిక నుంచే మంజూరు చేస్తున్నట్లు ప్రకటిస్తున్నా.

# బీజేపీలో ముదురుతోన్న అంతర్గత పోరు

# కమలదళం చీలిందా?

**న్యూస్ డెస్క్, 01 జూన్ (తెలుగు గళం):** బీజేపీలో అంతర్గత పోరు నానాటికీ ముదురుతోంది. ఆధిపత్య పోరులో ఒకరిపై మరొకరు పైచేయి సాధించేందుకు కొందరు నేతలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.ఈ క్రమంలోనే పార్టీ పరువు, ప్రతిష్ఠను రోడ్డుకు ఈడుస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రత్యర్థులను అణిచివేయడమే లక్ష్యంగా దుష్ప్రచారం చేస్తున్నారని టాక్ వినిపిస్తోంది. క్రమశిక్షణకు మారుపేరుగా ఉండే బీజేపీ పార్టీ ట్యాగ్ లైన్‌కు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కీలకనేతల మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరు కారణంగా కేడర్?తీవ్ర ఆందోళనకు గురవుతోంది. ఇప్పుడిప్పుడే రాష్ట్రంలో పార్టీకి మైలేజ్ వస్తున్న క్రమంలో నేతల తీరు వలన నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర నాయకత్వం ఇక్కడి పరిస్థితిపై దృష్టి సారించి సమస్యను పరిష్కరించేలా చూడాలని కేడర్ కోరుతోంది.



2 లో

**ఈటల రాజేందరే టార్గెట్..**

బీజేపీలో గత కొంతకాలంగా పాత, కొత్త వివాదం రాజుకుంది. పార్టీలోని కొందరు తాజాగా ఎంపీ ఈటల రాజేందర్ లక్ష్యంగా తీవ్ర ఆరోపణలు, విమర్శలు చేస్తూ పోస్టర్లు వేశారు. ఇది కేంద్రమంత్రి బండి సంజయ్?వర్గానికి చెందిన కొందరి పని అంటూ ఈటల అనుచరులు ఆరోపిస్తున్నారు. నిజామాబాద్?ఎంపీ అర్వింద్, ఈటల కొంతకాలంగా సాన్నిహిత్యంగా ఉంటున్నారని.. దీంతో వారిని లక్ష్యంగా చేసుకొని వారిమధ్య గ్యాప్ వచ్చేలా పోస్టర్‌ను ముద్రించారని ఈటల అనుచరులు ఆరోపిస్తున్నారు. అయితే, బండి సంజయ్ కొడుకు భగీరథ్ మీద పోక్సో కేసు కావడంతో కేంద్రమంత్రి, ఈటల, అర్వింద్ మధ్య వివాదం మరింత ముదరిందని పార్టీ నాయకులు చెబుతున్నారు. బండి రాష్ట్ర అధ్యక్షుడిగా దిగిపోవడానికి పరోక్షంగా ఈటల, ఇతర నేతలు కారణమంటూ బండి అనుచరులు ఆరోపిస్తున్నారు.

# గ్రామాలకు స్వేచ్ఛ

- సొంత నిధుల వినియోగం
- ట్రెజరీకి గుడ్‌బై
- సర్పంచ్‌కు చెక్ పవర్
- కార్యదర్శికి అధికారం
- స్థానిక నిధులు..స్థానిక పనులు
- రూ.140 కోట్లపై పట్టు
- చట్ట సవరణకు కసరత్తు
- ఉపసర్పంచ్‌కు చెక్
- బ్యాంకు ఖాతాల్లో నిధులు
- ఈ-పంచాయత్ పర్యవేక్షణ
- పారదర్శక ఖర్చులు
- తప్పనిసరి ఆడిట్
- అవినీతిపై ఉక్కుపాదం
- పల్లె పాలనలో కొత్త అధ్యాయం




**న్యూస్ డెస్క్, 01 జూన్ (తెలుగు గళం):** తెలంగాణలోని పల్లెల్లో స్వపరిపాలన దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఒక చారిత్రాత్మక అడుగు వేయబోతోంది. గ్రామ పంచాయతీల సొంత ఆదాయంపై ఇప్పటివరకు ఉన్న ప్రభుత్వ నియంత్రణను పూర్తిగా తొలగించి.. ఆ నిధులను స్థానిక అవసరాలకే నేరుగా వాడుకునేలా పంచాయతీరాజ్ చట్ట సవరణకు కసరత్తు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12,760 గ్రామ పంచాయతీలకు ఇళ్లు, నల్లా పన్నులు, లేఅవుట్ అనుమతులు, సంతల నిర్వహణ, వేలం పాటల ద్వారా ఏటా సుమారు రూ.140 కోట్ల వరకు సొంత ఆదాయం సమకూరుతోంది. అయితే.. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఈ నిధులన్నీ ప్రభుత్వ ట్రెజరీలో జమ అవుతుండటంతో రూపాయి ఖర్చు చేయాలన్నా ఆర్థిక శాఖ అనుమతి తప్పనిసరి అయింది.

ఈ పాత పద్ధతి వల్ల గ్రామాల్లో పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వాలన్నా, ట్రాక్టర్లకు డీజిల్ కొట్టించాలన్నా, వీధిలైట్లు, ఫినాయిల్, బ్లీచింగ్ పౌడర్ వంటి అత్యవసర వస్తువులు కొనాలన్నా నెలల తరబడి ట్రెజరీల చుట్టూ తిరగాల్సి వస్తోంది. కేంద్ర ఆర్థిక సంఘం నిధులు నేరుగా పంచాయతీల ఖాతాల్లో పడుతున్నప్పటికీ తాము కష్టపడి వసూలు చేసుకున్న సొంత నిధుల కోసం సర్పంచులు ఇబ్బందులు పడటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. దీనిపై పంచాయతీరాజ్ కమిషనర్ దివ్యా దేవరాజన్ క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా ప్రభుత్వానికి లేఖ రాయగా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి చట్ట సవరణకు ఆదేశాలు జారీ చేశారు.

మిగతాది 2 లో..


# 24 రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల

### 18న పోలింగ్


2 లో

# ఏపీసీసీ చీఫ్ షర్మిలకు రాజ్యసభ సీటు

### ప్రకటించిన అధిష్ఠానం


2 లో

## జనగణనలో భారీ సంఖ్యలు

### 4 కోట్లు దాటిన తెలంగాణ జనాభా?


2 లో

**న్యూస్ డెస్క్, 01 జూన్ (తెలుగు గళం):** రాష్ట్రంలో జనాభా నాలుగు కోట్లకు పైగానే ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం జనగణన హౌస్ లిస్టింగ్ సర్వే నడుస్తుండగా.. జూన్ ?9వ తేదీతో సర్వే పూర్తికానుంది. ఇప్పటివరకు రాష్ట్రంలో దాదాపుగా కోటి ఇళ్లల్లో జనగణన అధికారులు హౌస్‌లిస్టింగ్ సర్వే పూర్తిచేశారు. ఇందులో దాదాపుగా 3.86 కోట్ల జనాభా ఉందని లెక్కలు వేశారు. మరో 20 లక్షల ఇండ్లల్లో జనగణన సర్వే చేసి వివరాలు సేకరించాల్సి ఉందని అంచనా వేస్తున్నారు.

# ఖరీఫ్ రైతులకు వ్యవసాయశాఖ హెచ్చరిక


2 లో

**న్యూస్ డెస్క్, 01 జూన్ (తెలుగు గళం):** ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతులను వ్యవసాయశాఖ అప్రమత్తం చేస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో సంప్రదాయ పంటల కంటే పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవడమే ఉత్తమని సూచిస్తోంది. ఇప్పటికే రైతులు ఎలాంటి పంటల సాగు చేయాలనే అంశంపై యాక్షన్ప్లాన్సిద్ధం చేసింది. గతవారం రోజుల నుంచి మండల, గ్రామాలకు చెందిన వ్యవసాయ అధికారుల నుంచి సలహాలు, సూచనలు తీసుకుని రైతులకు మేలు చేసే పంటలు సాగు చేసేలా ప్రచారం చేయనుంది. ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో గ్రామాలకు వెళ్లి రైతులు తక్కువ కాలంలో చేతికొచ్చే పంటల సాగుతో పాటు నీటి లభ్యత ప్రకారం సాగు చేయాలనే అంశాలను వివరించనున్నారు. జూన్లో వర్షాలు ప్రారంభమవుతాయని భావించి తొందరపడి వరి సాగులోకి వెళ్లడం ప్రమాదకరమని, నీటి లభ్యతపై పూర్తి భరోసా ఉన్నప్పుడు మాత్రమే వరి వంటి నీటి ఆధారిత పంటలను సాగు చేయాలని సూచిస్తున్నారు.


**మధ్యంతర కరువు**

జూన్నెలలో సాధారణ వర్షపాత నమోదయ్యే అవకాశాలు ఉన్నప్పటికి రైతులు దాని ఆధారంగా అధిక నీటి అవసరమయ్యే పంటల వైపు మొగ్గు చూపకూడదని వ్యవసాయశాఖ హెచ్చిరించింది. జూలై, ఆగస్టు నెలల్లో మధ్యంతర కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని ఈసమయంలో సాగునీటి నిర్వహణ అత్యంత కీలకమతుందని తెలిపింది. ఆగస్టు, సెప్టెంబర్లో కూడా నీటి సరఫరా కొనసాగుతుందనే నమక్మం ఉన్న ప్రాంతాల్లో మాత్రమే వరి సాగు చేయాలని, లేకుంటే ఇతర పంటలు ఎంచుకోవడం మంచిదని వ్యవసాయ రంగ నిపుణులు కూడా సూచిస్తున్నారు.

# రాష్ట్రంలో అభివృద్ధి పనుల జోరు

### ఉచిత తాగునీరు, యంగ్ ఇండియా స్కూళ్లకు నిధుల విడుదల



2 లో

**న్యూస్ డెస్క్, 01 జూన్ (తెలుగు గళం):** రాష్ట్రంలో ప్రజా మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తూ ఆర్థిక శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని పలు ప్రతిష్టాత్మక అభివృద్ధి పనులకు గాను భారీగా నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ నగర ప్రజలకు నిరంతరాయంగా తాగునీటిని అందించే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత తాగునీటి పథకానికి ఊరట లభించింది.

## రాష్ట్రంలో మరో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు : సీఎం రేవంత్‌రెడ్డి



మొదటి పేజీ తరువాయి

తెలంగాణ సీఎం అంటే ఎందుకంత చిన్నచూపు

కాళేశ్వరంలో పెట్టిన రూ. లక్ష కోట్లు గోదావరిలో కలిసిపోయాయి. బీఆర్ఎస్ పాలనలో ఆదిలాబాద్‌లోని ప్రాజెక్టులను పట్టించుకోలేదు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించి ఆదిలాబాద్‌లోని 2 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తాం. తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత–చేవెళ్ల కోసం మహారాష్ట్ర సీఎంకు లేఖ రాశాను. అయినా అక్కడి నుంచి స్పందన లేదు. తెలంగాణ సీఎం అంటే మహారాష్ట్ర సీఎంకు ఎందుకుంత చిన్నచూపు? సమస్య పరిష్కరించడానికి కిషన్‌రెడ్డి చొరవ తీసుకోవాలి. పోలవరం ప్రాజెక్టు కోసం తెలంగాణలోని 7 గ్రామాలను ఏపీలో కలపలేదా? తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు వల్ల మహారాష్ట్రకు కలిగే నష్టాన్ని భరిస్తాం. మహారాష్ట్ర నుంచి 2వేల ఎకరాలు మాత్రమే అడుగుతున్నాం.

వడ్లు కొనకపోతే కేంద్రంపై యుద్ధమే

రాష్ట్రంలో ఇప్పటి వరకు 62లక్షల క్వింటాళ్ల వడ్లు కొనుగోలు చేశాం. మొత్తం 75లక్షల క్వింటాళ్ల వడ్లు కొంటాం. జూన్ 15 నాటికి ఈ కొనుగోళ్లు పూర్తవుతాయి. మేం సేకరించిన వడ్లు, మక్కలు, జొన్నలను కేంద్రం కొనాలి. దీనికి కిషన్‌రెడ్డి సహకారం అందించాలి. వడ్లు కొనకపోతే జూన్ 15 తర్వాత కేంద్రంపై యుద్ధం చేస్తాం"అని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.

## 24 రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల.. 18న పోలింగ్





**న్యూస్ డెస్క్, 01 జూన్ (తెలుగు గళం):** దేశంలో 24 రాజ్యసభ స్థానాలను భర్తీ చేసేందుకు ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో నాలుగేసి స్థానాలకు రాజ్యసభ ఎన్నికలు జరగనుండగా.. రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో మూడేసి స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. జార్ఖండ్లో రెండు రాజ్యసభ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ స్థానాలన్నింటినీ భర్తీ చేసేందుకు నామినేషన్లు కోరుతూ ఈసీ నోటిఫికేషన్ విడుదల చేసింది. జూన్ 8వ తేదీ వరకూ అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేయాలని నోటిఫికేషన్లో పేర్కొంది. నామినేషన్ల స్క్రూటినీ జూన్ 9న చేపట్టనుంది. జూన్ 11వ తేదీ వరకూ అభ్యర్థులు తమ నామినేషన్లను విత్ డ్రా చేసుకునేందుకు గడువు ఇచ్చింది.

జూన్ 18న 24 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్.. అదేరోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్లను లెక్కించి తుది ఫలితాలను వెల్లడించనుంది. జూన్ 20వ తేదీ నాటికి రాజ్యసభ ఎన్నికల ప్రక్రియ పూర్తికానుంది.

కాగా.. ఏపీలో పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పరిమళ్ నత్వానీ, సానా సతీష్ ల పదవీకాలం ఈ నెల 26వ తేదీనాటికి ముగియనుంది. దీంతో ఈ నాలుగు స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ నోటిఫికేషన్ ఇచ్చింది. వీరి స్థానాల్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎవరెవరిని నిలబెడుతుందన్న విషయంపై ఇంకా స్పష్టత రాలేదు.

## రాష్ట్రంలో అభివృద్ధి పనుల జోరు..

### ఉచిత తాగునీరు, యంగ్ ఇండియా స్కూళ్లకు నిధుల విడుదల




**న్యూస్ డెస్క్, 01 జూన్ (తెలుగు గళం):** రాష్ట్రంలో ప్రజా మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తూ ఆర్థిక శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని పలు ప్రతిష్టాత్మక అభివృద్ధి పనులకు గాను భారీగా నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ నగర ప్రజలకు నిరంతరాయంగా తాగునీటిని అందించే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత తాగునీటి పథకానికి ఊరట లభించింది. ఈ పథకానికి సంబంధించిన రీయింబర్స్‌మెంట్ కింద జలమండలికి రూ.75 కోట్ల నిధులను ఆర్థిక శాఖ విడుదల చేసింది. ఈ నిధులతో నీటి సరఫరా వ్యవస్థ మరింత మెరుగుపడటంతో పాటు, బకాయిల చెల్లింపులకు మార్గం సుగమం కానుంది.

రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి భారీగా నిధులు మంజూరయ్యాయి. బీసీ సంక్షేమ శాఖ పరిధిలో నిర్మించ తలపెట్టిన ఈ పాఠశాలల భవన నిర్మాణ పనుల కోసం ఆర్థిక శాఖ రూ.414 కోట్లు కేటాయించింది. అన్ని వర్గాల విద్యార్థులకు ఒకేచోట అత్యుత్తమ వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ఈ నిధులు ఎంతగానో ఉపయోగపడనున్నాయి.

## ఏపీసీసీ చీఫ్ షర్మిలకు రాజ్యసభ సీటు.. ప్రకటించిన అధిష్ఠానం

**న్యూస్ డెస్క్, 01 జూన్ (తెలుగు గళం):** ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు రాజ్యసభ సీటు కేటాయిస్తున్నట్లు కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించింది. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటన చేశారు. కర్ణాటక నుంచి ఆమెను రాజ్యసభకు పంపుతున్నట్లు ఆయన వెల్లడించారు. షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరిన సమయంలోనే.. ఆమెకు రాజ్యసభ సీటు ఇస్తామని కాంగ్రెస్ అధిష్ఠానం హామీ ఇచ్చింది. ఆ హామీ మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. కర్ణాటకలో నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీగా ఉండగా.. వాటిలో ఒకటి షర్మిలకు కేటాయించింది పార్టీ అధిష్ఠానం. ప్రస్తుతం అక్కడ కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉండటంతో.. షర్మిల గెలుపు ఈజీ కానుందన్న సంకేతాలు వెలువడుతున్నాయి.

ఏపీసీసీ అధ్యక్షురాలిగా ఉన్న షర్మిలకు రాజ్యసభ అవకాశం కల్పించడం ద్వారా సౌతిండియా పాలిటిక్స్ లో కాంగ్రెస్ ను మరింత బలపడేలా చేయాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్.. ఏపీలోనూ పునర్వైభవాన్ని పొందాలని చూస్తోంది. రెండ్రోజుల క్రితమే షర్మిల కాంగ్రెస్ అగ్రనేత అయిన రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తో భేటీ అవ్వగా.. రాజ్యసభకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని వార్తలొచ్చిన విషయం తెలిసిందే.

## బీజేపీలో ముదురుతోన్న అంతర్గత పోరు.. కమలదళం చీలిందా?

మొదటి పేజీ తరువాయి

నిజామాబాద్‌ఎంపీ అర్వింద్, ఈటల కొంతకాలంగా సాన్నిహిత్యంగా ఉంటున్నారని.. దీంతో వారిని లక్ష్యంగా చేసుకొని వారిమధ్య గ్యాప్ వచ్చేలా పోస్టర్‌ను ముద్రించారని ఈటల అనుచరులు ఆరోపిస్తున్నారు. అయితే, బండి సంజయ్ కొడుకు భగీరథ్ మీద పోక్సో కేసు కావడంతో కేంద్రమంత్రి, ఈటల, అర్వింద్ మధ్య వివాదం మరింత ముదరిందని పార్టీ నాయకులు చెబుతున్నారు. బండి రాష్ట్ర అధ్యక్షుడిగా దిగిపోవడానికి పరోక్షంగా ఈటల, ఇతర నేతలు కారణమంటూ బండి అనుచరులు ఆరోపిస్తున్నారు. సంజయ్ కొడుకు వివాదం బయటకు రావడంలో ఈటల, అర్వింద్ హస్తముందంటూ ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ ముగ్గురు నేతల మీద బహిరంగంగానే సోషల్?మీడియాలో పరస్పర పోస్టులు, విమర్శలు వైరల్ అవుతున్నాయి.

పోస్టర్‌లో ఏముంది?

'ఈటల ఏడుపే బీజేపీకి శాపం..! రాష్ట్ర అధ్యక్ష పదవి రాలేదని ఏడుపు, సీఎం అభ్యర్థిగా ప్రకటించలేదని ఏడుపు... కేంద్రమంత్రి పదవి రాలేదని ఏడుపు. రెండు చోట్ల ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఇచ్చింది బీజేపీ. ఓడిపోయినా మల్కాజిగిరి ఎంపీ టికెట్ ఇచ్చింది బీజేపీ. మోడీ నాయకత్వంలో గెలిచినా.. నా ఇమేజ్‌తోనే గెలిచాను అనడం ఇదేం రాజకీయ నైతికత. బీసీ నాయకులు ఎదుగుతుంటే అసహనం ఎందుకు? ఇందూరు బిడ్డ ఎంపీ అర్వింద్‌కు వస్తున్న ఆదరణ చూసి కడుపుమంట ఎందుకు? నేనే బీసీ నాయకుడిని.. నేనే ప్రత్యామ్నాయం.. అనే భ్రమ నుంచి బయటకు రా ఈటల. బీజేపీ నీకు ఎన్నో అవకాశాలు ఇచ్చింది' అంటూ ఆ పోస్టర్‌లో రాసుకొచ్చారు.

కేంద్రమంత్రి పదవిపై ఆశలు..

బండిని కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకునే క్రమంలో తమకు పదవి వస్తుందని ఎంపీలు ఈటల, అర్వింద్, డీకే అరుణ తదితరులు భావించారు. తీరా బండికి చాన్స్ దక్కడంతో వారంతా నిరాశ చెందారు. రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం వారంతా ఎదురుచూశారు. కానీ, సాధ్యం కాలేదు. త్వరలో కేంద్ర మంత్రివర్గ విస్తరణ ఉంటుందని టాక్. రాజ్యసభ ఎన్నికల అనంతరం ఈనెలాఖరున లేదా వచ్చేనెల మొదటి వారంలో విస్తరణ ఉండే అవకాశం ఉంది. రాష్ట్రంలో మరొకరికి కేంద్రమంత్రి పదవి వచ్చే చాన్స్ ఉంటుందని ప్రచారం జరుగుతోంది. దీంతో ఎంపీలు ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. మహిళా కోటాలో డీకే అరుణ, ఎస్టీ కోటాలో నగేశ్, బీసీ కోటాలో లక్ష్మణ్, ఈటల, అర్వింద్‌లు ఉన్నారు. ఈ క్రమంలోనే గ్రూపు రాజకీయాలు, ఆధిపత్య పోరు పెరిగిందని పార్టీలో చర్చ జరుగుతోంది.

బీజేఎల్పీ నేతల ఖండన

ఈటలకు వ్యతిరేకంగా పోస్టర్లు వెలిసిన నేపథ్యంలో బీజేఎల్పీనేత మహేశ్వర్?రెడ్డితో పాటుగా మిగతా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రకటన విడుదల చేశారు. పోస్టర్ల వివాదాన్ని ఖండించారు. ఎంపీ ఈటలను కించపరిచేలా ఏర్పాటు చేసిన బ్యానర్లను రాష్ట్ర బీజేపీ నేతలు, కార్యకర్తలు ముక్తకంఠంతో ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇది ఒక నాయకుడిపై వ్యక్తిగత దాడి మాత్రమే కాదని, తెలంగాణ బీజేపీ ఎదుగుదలను చూసి భయపడుతున్న ప్రత్యర్థి రాజకీయ శక్తుల అసురక్షిత భావానికి నిదర్శనమని వివరించారు. ఈటల దాదాపు 40 ఏళ్ల రాజకీయ అనుభవం కలిగిన సీనియర్ నాయకుడని, ప్రజా జీవితంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న వ్యక్తిని కించపరిచేలా నీచ రాజకీయాలు చేయడం సరికాదన్నారు. ఈ విషయంలో రాష్ట్ర బీజేపీ నాయకులు ఐక్యం ఉండి కుట్రలను తిప్పికొడతామని పేర్కొన్నారు.

## ఎల్‌నినో ఎఫెక్ట్.. ఖరీఫ్ రైతులకు వ్యవసాయశాఖ హెచ్చరిక

మొదటి పేజీ తరువాయి

ఈ ఖరీఫ్సీజన్‌ప్రభుత్వం 131 లక్షల ఎకరాలో వివిధ పంటలు సాగు అవుతాయని అంచనావేసి అందులో వరి 65 లక్షలు సాగు అవుతుందని గుర్తించింది. ఎల్‌నినో కారణంగా వరిసాగు 35 లక్షల ఎకరాలు దాటకుండా ప్రయత్నాలు చేస్తోంది.



అధిక ఆదాయం

రైతులు కూరగాయలు, పండ్లు, నువ్వులు, పొద్దు తిరుగుడు, కుసుమలు, శనగలు పంటలు వేస్తే అధిక ఆదాయం వస్తోందని ఉద్యాన శాఖ పేర్కొంటుంది. ఈఏడాది నుంచి మార్కెట్సౌకర్యాలు మెరుగుపరుస్తుండగా పంటను చేనులో నుంచి నేరుగా మార్కెట్ కు తీసుకొచ్చి అమ్ముకునేలా ఏర్పాట్లు చేస్తోంది. రైతులు కూరగాయలు, పండ్లు మార్కెట్కు తీసుకొచ్చినప్పుడే ధరలు పడిపోతాయి. అదే దళారులు కొనుగోలు చేసిన సరుకులు రెండింతలు ధరలు పెరుగుతాయి. ఈసారి అలాంటి పరిస్థితులు రాకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ వానాకాలంలో వ్యవసాయశాఖ వేరుశనగ 26 వేల ఎకరాలు, నువ్వులు 650 ఎకరాలు, పొద్దు తిరుగుడు 150 ఎకరాలు, కుసుమలు 3,600 ఎకరాల్లో సాగు కావచ్చని అంచనా వేస్తోంది. జొన్నలు 39 వేల ఎకరాలు, సజ్జలు 1200 ఎకరాల్లోనే సాగు అయ్యే అవకాశం ఉందని భావిస్తోంది. మొక్కజొన్నలు 5.40 లక్షల ఎకరాలు, కంది పంట 5.10 లక్షల ఎకరాల్లో వేయాలని టార్గెట్ పెట్టుకుంది. మిర్చి 1.90 లక్షల ఎకరాలు, సోయాబీన్4.10 లక్షల ఎకరాలు, పెసర్లు 65 వేల ఎకరాలు, మినుములు 28 ఎకరాలు రైతులు సాగు చేసేలా ప్రయత్నాలు చేస్తోంది.


సన్న వరిసాగు

ఈసారి వానలు తక్కువగా కురిసే పరిస్థితి ఉండటంతో సన్న వరి కంటే దొడ్డు రకాలు వేయాలని రైతులకు వ్యవసాయ శాఖ సూచించనుంది. సన్నాలు వేస్తే అధిక నీటి వినియోగంతో పాటు పంట కాలం ఎక్కువగా ఉంటుంది. దీంతో సమయానికి నీరు లభించకుంటే పంట ఎండిపోవడంతో పాటు పెట్టుబడి రైతులు నష్టపోతారు. దొడ్డు వరి సాగు చేస్తే తక్కువ కాలంలో పంట చేతికి రావడంతో పాటు నీటి సమస్య ఉన్న అధిగమించవచ్చు. ఒక వేళ పంట ఎండిన పెద్దగా నష్టం కూడా ఉండదు. ఎరువుల వినియోగం సన్నాల కంటే తక్కువ ఉంటుంది.

## గ్రామాలకు స్వేచ్ఛ..సొంత నిధుల వినియోగం

మొదటి పేజీ తరువాయి

ఈ ఆర్థిక స్వేచ్ఛను అమలు చేయడానికి తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018 లోని సెక్షన్ 70(3)ని సవరించాల్సి ఉంటుంది.




దీంతోపాటు నిధుల డ్రా ప్రక్రియలో పారదర్శకత కోసం జాయింట్ చెక్ పవర్ విధానంలో కీలక మార్పు చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న సర్పంచ్, ఉపసర్పంచ్ ఉమ్మడి చెక్ పవర్ స్థానంలో.. ఉపసర్పంచ్‌ను తొలగించి గ్రామ కార్యదర్శికి ఆ బాధ్యతలు అప్పగించనున్నారు. ఈ మేరకు రూపొందించిన రెండు ఆర్డినెన్స్‌లను త్వరలో జరగబోయే మంత్రిమండలి సమావేశంలో ప్రవేశపెట్టి ఆమోదం తెలపనున్నారు. ఈ ఆర్డినెన్స్ అమలులోకి వస్తే.. పంచాయతీల సొంత ఆదాయం నేరుగా స్థానిక బ్యాంకు ఖాతాల్లోనే నిల్వ ఉంటుంది.

అయితే.. నిధుల వినియోగంలో దుర్వినియోగం, అవినీతి జరగకుండా ప్రభుత్వం అత్యంత కఠినమైన నిబంధనలను విధిస్తోంది. పంచాయతీకి వచ్చే ప్రతి రూపాయి ఆదాయం, చేసే ప్రతి ఖర్చు వివరాలను విధిగా రాష్ట్ర ప్రభుత్వ అధికారిక ఈ-పంచాయత్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుంది. అలాగే పారదర్శకత కోసం ఆ వివరాలను గ్రామ పంచాయతీ కార్యాలయ బోర్డుపై ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాలి. వీటికి తోడు ప్రతి ఏటా తప్పనిసరిగా స్టేట్ ఆడిట్ విభాగంతో ఆడిటింగ్ నిర్వహించాలి. ఒకవేళ నిధుల వినియోగంలో ఎలాంటి అవకతవకలు లేదా నిబంధనల ఉల్లంఘనలు జరిగినా సర్పంచ్, గ్రామ కార్యదర్శులను సంయుక్తంగా బాధ్యులను చేస్తూ వారిపై కఠిన క్రిమినల్, శాఖాపరమైన చర్యలు తీసుకునేలా చట్టంలో నిబంధనలు పొందుపరుస్తున్నారు.

## జనగణనలో భారీ సంఖ్యలు.. 4 కోట్లు దాటిన తెలంగాణ జనాభా?

మొదటి పేజీ తరువాయి

నాలుగు వారాల సర్వేలో భాగంగా వారానికి దాదాపుగా 30 లక్షల ఇళ్ల చొప్పున యజమానుల వివరాలు సేకరిస్తున్నారు. మొదట్లో మ్యాపింగ్, ఆ ప్రాంతంపై అవగాహన, యాప్‌లో సాంకేతిక సమస్యల కారణంగా మొదటి మూడు, నాలుగు రోజులు సర్వే కొద్దిగా నెమ్మదిగా సాగింది. ఆ తర్వాత వేగం పుంజుకుంది. జూన్ 9తో సర్వేను పూర్తి చేయాల్సి ఉంది.

జనగణన, ఓటరు మ్యాపింగ్ ఒకేసారి..

గ్రామీణ ప్రాంతాల్లో హౌస్‌లిస్టింగ్ సర్వేలో ఎలాంటి సమస్య లేకపోయినా పట్టణ ప్రాంతాల్లోనే సమస్యలు వస్తున్నాయని అధికారులు గుర్తించారు. ప్రస్తుతం వేసవి సెలవులు ఉన్నందున అనేక మంది తీర్థయాత్రలు, విహారయాత్రలు, వ్యక్తి గత పనులు, గ్రామీణ ప్రాంతాలకు వెళ్లినట్టు గుర్తించారు. అనేక ఇళ్లకు తాళాలు వేసి ఉన్నందున ఇబ్బందులు వస్తున్నాయని సిబ్బంది చెబుతున్నారు. ఒకే ఇంటికి రెండు, మూడు సార్లు వెళ్లాల్సి వస్తుందని, ఇంట్లో ఎవరూ ఉండటంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌లో అంచనా వేసిన దాని కంటే ఎక్కువ సంఖ్యలోనే ఇళ్లు ఉన్నాయని.. కొత్త కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు పెద్ద ఎత్తున రావడంతో సిబ్బందిపై అదనపు భారం పడుతోందని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్రంలో వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ఎండలకు ప్రజలు అల్లాడుతున్నారు. అనేక మంది వడదెబ్బతో చనిపోతున్నారు. సర్వే చేసే సిబ్బంది సైతం ఎండలో తిరగలేక ఉదయం, సాయంత్రం వేళల్లో తమ పనిని ముగించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. పట్టణాల్లో విద్యావంతులు ఉన్నా సిబ్బందికి సరిగా సహకరించడంలేదని ఫిర్యాదులు అందుతున్నాయి. సహాయనిరాకరణ చేయడం, అనేక యక్ష ప్రశ్నలు వేసి సిబ్బందిని విసిగిస్తున్నట్టు తెలిసింది. ఇదే సమయంలో ఓటరు జాబితా ప్రక్షాళన మ్యాపింగ్?సైతం చేస్తున్నారు. కొన్నిచోట్ల జనగణన, మరోవైపు ఓటరు మ్యాపింగ్ ఒకేసారి జరుగుతుండటంతో ఎవరు ఏ అధికారి అని తెలియక ప్రజలు అయోమయానికి గురవుతున్నట్టు సమాచారం. ఓటరు మ్యాపింగ్ అధికారులు వారికి సంబంధించిన వ్యక్తుల వివరాలు, ధ్రువపత్రాలు కూడా అడుగుతుండటంతో కొంత గందరగోళానికి గురవుతున్నారు. పూర్తి అవగాహన లేకపోవడంతో వల్ల కొంత ఆందోళనకు కూడా గురైనట్టు సమాచారం.

సర్వేల్లో తేడాలు..

గతంలో రాష్ట్ర ప్రభుత్వం బీసీ గణన చేసినప్పుడు 1.15 కోట్ల కుటుంబాలను గుర్తించారు. నాడు మొత్తం జనాభా 3.50 కోట్లుగా తేలింది. కానీ, కొందరు సర్వేలో పాల్గొనలేదు. ప్రస్తుత జనగణనలో మాత్రం అంత కంటే తక్కువ సంఖ్యలోనే ఇళ్లు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. బీసీ గణనలో ప్రభుత్వ పథకాల కోసం కలిసి ఉన్న కుటుంబాలు సైతం విడివిడిగా వివరాలు నమోదు చేసుకున్నాయి. జనగణనకు వచ్చే సరికి మాత్రం అందరూ తక్కువ కుటుంబాలను చూపుతున్నట్టు తెలుస్తోంది. దీంతో కుటుంబాల సంఖ్య తక్కువగా, జనాభా సంఖ్య ఎక్కువగా ఉంటోందని క్షేత్రస్థాయి జనగణన అధికారులు చెబుతున్నారు. 1.15 కోట్లకు కొంచెం అటు ఇటుగా కుటుంబాలు ఉంటాయని, జనాభా మాత్రం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే దాదాపుగా కోటి వరకు ఇళ్ల సర్వే పూర్తయిందని, హైదరాబాద్ మహానగరంలో మాత్రం ఇళ్ల సంఖ్య పెరిగే చాన్స్ ఉందని, గేటెడ్ కమ్యూనిటీలోనూ కొందరు బీసీ గణనకు సహకరించలేదని.. కానీ, ప్రస్తుతం జనగణనకు ప్రజలంతా సహకరిస్తున్నందున ఎక్కువ సంఖ్యలో ఇళ్లు నమోదయ్యే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు.

## సైదాదుపల్లిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ లో పాల్గొన్నా - చెన్ను అశోక్ రెడ్డి



**నెల్లూరు జిల్లా రాపూరు (తెలుగు గళం):-** నెల్లూరు జిల్లా రాపూరు మండలం సైదాదుపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాపూరు మండల అధ్యక్షులు చెన్ను అశోక్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి లబ్ధిదారుల ఇంటింటికి తిరిగి స్వయంగా పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చెన్ను అశోక్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.

విజన్ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి అయితే రాష్ట్ర భవిష్యత్తు ఎలా మారుతుందో చెప్పడానికి చంద్రబాబు నాయుడు నిదర్శనం.


సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని మళ్లీ ప్రగతి పథంలోకి తెచ్చేందుకు ఆయన అహర్నిశలు శ్రమిస్తున్నారు.

రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావాలన్నా, అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా నిర్మించాలన్నా. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రతి ఎకరాకూ నీరివ్వాలన్నా. అది కేవలం అనుభవజ్ఞుడైన నాయకుడు నారా చంద్రబాబు నాయుడు వల్లనే సాధ్యమవుతుంది. ఆయన చేతులు బలోపేతం అయితేనే మన పిల్లల భవిష్యత్తు,మన రాష్ట్ర భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది.

రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వాన్ని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.కులమతాలకు,రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ అభివృద్ధి యజ్ఞంలో భాగస్వాములు కావాలి.సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్దాం. చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని, కూటమి ప్రభుత్వాన్ని మరింత బలపరుద్దాం నవ్యాంధ్రప్రదేశ్‌ను అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందాం అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నల్లవడ్ల వెంకట రమణా రెడ్డి, బత్తిన శ్రీహరి రెడ్డి, చిలకం ప్రసాద్ రెడ్డి,, చంద్రమౌళి, మోహన్, కూకటి పెంచలయ్య యాదవ్, గొర్ల వెంకటేశ్వర్లు యాదవ్, పల్లమాల మల్లేశ్వర్ యాదవ్, సమయం రమణ ప్రసాద్, తదితర నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆందోళనకు పిలుపునిచ్చిన కాక్రోచ్ జనతా పార్టీ




**న్యూస్ డెస్క్, 01 జూన్ (తెలుగు గళం):** నీట్ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న వరుస వైఫల్యాలు, అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని 'కాక్రోచ్ జనతా పార్టీ' డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ డిప్కే జూన్ 6న ఢిల్లీలో భారీ శాంతియుత నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియోను విడుదల చేస్తూ ఈ విషయాన్ని వెల్లడించారు. విద్యార్థులు, యువత రాజ్యాంగబద్ధంగా, శాంతియుతంగా ఏకమై గళం వినిపిస్తే ప్రభుత్వం తప్పక దిగివస్తుందని ఆయన పేర్కొన్నారు.

కార్యాచరణ ఇలా.. జంతర్ మంతర్ వద్ద నిరసన

జూన్ 6వ తేదీ (శనివారం) ఉదయం అభిజీత్ డిప్కే ఢిల్లీకి చేరుకోనున్నారు. విమానాశ్రయం వద్దకు విద్యార్థులు, మద్దతుదారులు పెద్ద ఎత్తున చేరుకోవాలని ఆయన కోరారు. అక్కడి నుంచి అందరూ కలిసి నేరుగా పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టేందుకు పోలీసుల అనుమతి కోరనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా యువత సమస్యలపై పోరాడుతున్న ఈ 'కాక్రోచ్ జనతా పార్టీ' నెటిజన్లతో పాటు పలువురు ప్రముఖుల మద్దతును కూడగట్టుకుంటూ విశేష ఆదరణ పొందుతుండటం గమనార్హం.

# నేర ప్రవృత్తి విడనాడితేనే సమాజంలో గుర్తింపు-సిఐ ఎ.మహేందర్

## హసన్పర్తి పోలీస్ స్టేషన్ లో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్




తెలుగు గళం న్యూస్ హన్మకొండ జూన్ 01

సమాజంలో శాంతిభద్రతలను కాపాడటంతో పాటు, రౌడీషీటర్ల ప్రవర్తనలో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా హన్మకొండ జిల్లా హసన్పర్తి పోలీస్ స్టేషన్ లో రౌడీషీటర్లకు శనివారం ఒక విశేష కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు.హసన్పర్తి పోలీస్ ఇన్స్పెక్టర్ ఎ. మహేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్టేషన్ పరిధిలోని 18 మంది రౌడీషీటర్లు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మహేందర్ రౌడీషీటర్లకు గట్టి హెచ్చరికలు జారీ చేస్తూనే, సన్మార్గంలో నడిచేందుకు పలు సూచనలు చేశారు.

**ఆధునిక సాంకేతికతతో నిరంతర నిఘా**

ఇకపై నేరాలకు దూరంగా ఉంటేనే సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తాయని ఇన్స్పెక్టర్ స్పష్టం చేశారు. "ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రౌడీషీటర్ల కదలికలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతున్నారు.భవిష్యత్తులో మళ్లీ ఏ రకమైన నేరాలలో పాల్గొన్నా కఠిన చర్యలు ఉంటాయి. అవసరమైతే జీవితాంతం జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుంది" అని ఆయన హెచ్చరించారు.

**10 ఏళ్లు సత్ప్రవర్తనతో ఉంటే రౌడీషీట్ రద్దు**

రౌడీషీటర్లు తమ పాత ప్రవృత్తిని వీడి, కుటుంబ సమేతంగా ప్రశాంతమైన జీవితాన్ని సాగించాలని ఇన్స్పెక్టర్ పిలుపునిచ్చారు. ఎవరైనా వరుసగా పదేళ్ల పాటు ఎలాంటి నేరాలకు పాల్పడకుండా, సత్ప్రవర్తనతో మెలిగితే వారిపై ఉన్న రౌడీషీట్‌ను ఎత్తివేస్తామని పోలీసుల తరఫున స్పష్టమైన హామీ ఇచ్చారు.పిల్లల చదువులకు, ప్రభుత్వ పథకాలకు పోలీసుల సహకారం నేర ప్రవృత్తిని పూర్తిగా విడనాడి, సమాజంలో మంచి పౌరులుగా బ్రతకాలనుకునే వారికి పోలీసులు అన్ని విధాలా అండగా ఉంటారని మహేందర్ తెలిపారు.అలాంటి వారి పిల్లల చదువులకు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూసేందుకు పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు.

**మంచిగా జీవిస్తామని రౌడీషీటర్ల ప్రమాణం**

పోలీసుల కౌన్సెలింగ్ అనంతరం రౌడీషీటర్లలో మార్పు కనిపించింది.తాము ఇకపై ఎలాంటి నేరాలకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడబోమని, భవిష్యత్తులో సత్ప్రవర్తనతో ఉంటూ సమాజ శ్రేయస్సుకు కట్టుబడి ఉంటామని కౌన్సెలింగ్‌కు హాజరైన 18 మంది రౌడీషీటర్లు పోలీసుల ఎదుట హామీ ఇచ్చారు.

### బదిలీపై వెళ్తున్న జనగామ మున్సిపల్ కమిషనర్

# మహేశ్వర్ రెడ్డికి ఘన సత్కారం

తెలుగు గళం న్యూస్, జనగామ జూన్ 1




జనగామ మున్సిపల్ కమిషనర్‌గా గత 11 నెలలుగా సేవలందించిన మహేశ్వర్ రెడ్డి గ్రేటర్ హైదరాబాద్‌కు బదిలీ కావడంతో సోమవారం జనగామ మున్సిపల్ కార్యాలయంలో మూడవ వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి గోపి ఆయనను శాలువాతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ బూడిద జ్యోతి గోపి మాట్లాడుతూ,మహేశ్వర్ రెడ్డి తన పదవీకాలంలో అన్ని వర్గాల ప్రజలతో మమేకమై పౌర సేవలను సమర్థవంతంగా నిర్వహించారని ప్రశంసించారు.ప్రత్యేక అధికారి పాలన కొనసాగిన ఎనిమిది నెలల కాలంలోనూ పట్టణ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేశారని పేర్కొన్నారు.మున్సిపల్ పాలక మండలి ఏర్పడిన తర్వాత అధికార, ప్రతిపక్ష సభ్యులతో సమన్వయం చేసుకుంటూ ప్రజా పాలన--99 రోజుల పట్టణ ప్రణాళిక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశారని తెలిపారు.అనేక ఒత్తిళ్లు, సవాళ్ల మధ్య కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చారని కొనియాడారు.జనగామ పట్టణ శివారు ప్రాంతమైన మూడవ వార్డులో రోడ్లు, వీధి దీపాలు, మురికి కాలువలు వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించారని చెప్పారు. మూడు సార్లు స్వయంగా వార్డులో పర్యటించి పరిస్థితులను పరిశీలించి తాత్కాలిక పరిష్కారాలు చేపట్టడంతో పాటు సంబంధిత సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారని గుర్తు చేశారు.ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి అందించిన సేవలను అభినందిస్తూ, ఆయన భవిష్యత్ బాధ్యతల్లో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.


# పేదల కన్నీళ్లపై రాజకీయాల రాజ్యం..!

## మేల్కొండి -- అక్రమాలను అరికట్టండి, మాకు న్యాయం చేయండి అంటూ నిరుపేదల ఆవేదన

## ఇంద్రమ్మ ఇళ్లు పేదల కోసమా..? నాయకుల అనుచరుల కోసమా..?

తెలుగు గళం న్యూస్ హన్మకొండ జూన్ 01

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో వేలాది మంది పేదలు, విద్యార్థులు, యువకులు తమ భవిష్యత్తు కోసం పోరాడారు. రాష్ట్రం ఏర్పడితే పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని, సొంత ఇల్లు, ఉపాధి, సంక్షేమ పథకాల ద్వారా అభివృద్ధి సాధిస్తామని ఆశించారు. కానీ నేడు అదే తెలంగాణలో పేదల ఆశలు అధికార గదుల ముందే కూలిపోతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రభుత్వం పేదల గుర్తింపునకు సర్వేలు నిర్వహిస్తున్నప్పటికీ, నిజంగా గుడిసెల్లో జీవిస్తున్న నిరుపేదలను గుర్తించడానికి ప్రత్యేక సర్వేలు అవసరమా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.టార్పాలిన్ షీట్ల కింద నివసిస్తూ, వర్షాలు పడితే నిద్రలేని రాత్రులు గడిపే కుటుంబాలు గ్రామాల్లోనే కనిపిస్తున్నాయి.అయినప్పటికీ వారికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇంద్రమ్మ ఇళ్ల పథకం పేదలకు వరంగా మారాల్సిన సమయంలో, కొందరు నాయకుల అనుచరులు, సిఫార్సుదారులు లబ్ధిదారుల జాబితాల్లో చోటు దక్కించుకుంటున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి రాజకీయ ఒత్తిళ్లు, సిఫార్సులు, అధికారుల సహకారంతో అర్హులైన పేదలను పక్కకు నెట్టి అనర్హులకు ప్రయోజనాలు కల్పిస్తున్నారనే విమర్శలు ప్రజల్లో అసంతృప్తిని పెంచుతున్నాయి.అసలైన పేదలు దరఖాస్తులు చేసుకుని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా స్పందన కనిపించడం లేదని వాపోతున్నారు. ఇల్లు అడిగితే "ఫైలు పెండింగ్‌లో ఉంది" అని, న్యాయం కోరితే "విచారణలో ఉంది" అని సమాధానాలు వస్తున్నాయని చెబుతున్నారు. బాధలు చెప్పుకున్నా "చూస్తాం" అనే మాట తప్ప కార్యాచరణ కనిపించడం లేదని అంటున్నారు.దీంతో ప్రజలు ఇప్పుడు ఒకే ప్రశ్న వేస్తున్నారు -- ఇంద్రమ్మ ఇళ్లు నిజంగా పేదల కోసమేనా? లేక నాయకుల అనుచరుల కోసమా? అని.



దాసరి రాజ్ కుమార్. బిఆర్ఎస్ పార్టీ,
నారాయణగిరి గ్రామ యువత అధ్యక్షులు.

రాష్ట్ర ముఖ్యమంత్రి గా.రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ఈ అంశంపై దృష్టి సారించాలని, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన పేదలకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు. పథకాల అమలులో పారదర్శకత తీసుకురావాలని, రాజకీయ జోక్యానికి అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.పేదల ఆశలు, ఆవేదనలు, కన్నీళ్లపై నిర్మితమైన రాజకీయ వ్యవస్థ ఎక్కువకాలం నిలవదని ప్రజలు హెచ్చరిస్తున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని అక్రమాలను అరికట్టి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు."మేల్కొండి... అక్రమాలను అరికట్టండి... పేదలకు న్యాయం చేయండి" అనే నినాదం నేడు గ్రామీణ ప్రాంతాల్లో బలంగా వినిపిస్తోంది.

# సీఎం క్యాంప్ ఆఫీస్ ముట్టడికి వెళ్లకుండా బీఆర్ఎస్ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/జూన్ 1



పర్వతగిరి, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర మాజీ సర్పంచ్‌ల జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం ముట్టడికి వెళ్లనున్న బీఆర్ఎస్ నాయకులను పర్వతగిరి పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.సోమవారం మండలానికి చెందిన ప్రస్తుత సర్పంచ్ ఏర్పుల శ్రీనివాస్,వడ్లకొండ గ్రామ మాజీ సర్పంచ్,మాజీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు అమడగాని రాజు యాదవ్,మాల్య తండా మాజీ సర్పంచ్ బోడ ఈర్యా నాయక్, హట్య తండ మాజీ ఉప సర్పంచ్ తిరుపతిలను వారి నివాసాల వద్దే పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.అరెస్టులతో ఉద్యమాలు ఆగవు: అరెస్టు అనంతరం మాజీ సర్పంచ్ అమడగాని రాజు యాదవ్ మాట్లాడుతూ,అరెస్టులతో తమ ఉద్యమాలను అణచివేయలేరని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న సర్పంచ్‌ల బిల్లులను ప్రభుత్వం విడుదల చేసే వరకు తమ పోరాటం ఆగదని తేల్చిచెప్పారు.గ్రామ పంచాయతీల అభివృద్ధి పనుల కోసం సొంత డబ్బులు ఖర్చు చేస్తే, ఆ బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో సర్పంచులు, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులను విడుదల చేసి తమ కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# తెలంగాణ సాధన తరాల త్యాగాలకు దక్కిన గౌరవం

## -- గూడూరు ప్రణయ్ (స్టీఫెన్ రాజ్)




తెలుగు గళం న్యూస్ ధర్మసాగర్ జూన్ 01

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యువ నాయకుడు గూడూరు ప్రణయ్ (స్టీఫెన్ రాజ్) తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకుంటూ ప్రత్యేక సందేశాన్ని విడుదల చేశారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో విద్యార్థి దశలో తాను కూడా భాగస్వామిగా ఉన్నానని, ఆ పోరాట ఫలితంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడటం తన జీవితంలో గర్వించదగ్గ ఘట్టమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడటం అనేది ఒక్కరోజులో జరిగిన పరిణామం కాదని, దశాబ్దాల పాటు సాగిన ఉద్యమాలు, వేలాది మంది ప్రజల త్యాగాలు, విద్యార్థుల పోరాటాలు, మేధావుల కృషి మరియు అమరవీరుల బలిదానాల ఫలితమని అన్నారు.తెలంగాణ కోసం అహర్నిశలు పోరాడిన ఉద్యమకారుల కలలు సాకారం కావడంతోనే ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిందని తెలిపారు.తెలంగాణ అనేది కేవలం ఒక భౌగోళిక ప్రాంతం మాత్రమే కాదని, అది ఆత్మగౌరవానికి, స్వాభిమానానికి, సామాజిక న్యాయానికి ప్రతీక అని అన్నారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఉద్యమించిన అమరవీరుల త్యాగాలను ప్రతి తెలంగాణ బిడ్డ ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర ఏర్పాటు తర్వాత అనేక రంగాల్లో తెలంగాణ గణనీయమైన అభివృద్ధిని సాధించినప్పటికీ, ఇంకా సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో ప్రజలు కలలు కన్న బంగారు తెలంగాణ సాధన కోసం యువత ముందుకు వచ్చి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు.ప్రజల సంక్షేమం, విద్య, ఉపాధి, వ్యవసాయం, సామాజిక న్యాయం, గ్రామీణాభివృద్ధి వంటి అంశాలపై ప్రభుత్వం మరియు ప్రజలు సమిష్టిగా కృషి చేసినప్పుడే తెలంగాణ మరింత ప్రగతి సాధిస్తుందని అభిప్రాయపడ్డారు."తెలంగాణ కోసం జరిగిన పోరాటం ఒక చరిత్ర అయితే, తెలంగాణ అభివృద్ధి మనందరి బాధ్యత. రాష్ట్ర సాధనలో ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా సమానత్వం, అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని గూడూరు ప్రణయ్ (స్టీఫెన్ రాజ్) పేర్కొన్నారు.చివరిగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, "తెలంగాణ సాధన ఒక విజయం కాదు... అది తరాల త్యాగాలకు దక్కిన గౌరవం" అని అన్నారు.

# నేడు తెలంగాణ అవతరణ దినోత్సవం

## : ఎమ్మెల్యే నాగరాజు ఆధ్వర్యంలో వేడుకలు

తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట/జూన్ 1



వర్ధన్నపేట,జూన్ 2న జరిగే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా, విజయవంతంగా నిర్వహించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పిలుపునిచ్చారు.మంగళవారం ఉదయం 7:15 గంటలకు వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని ఆయన కార్యాలయం తెలిపింది.అనంతరం ఉదయం 10 గంటలకు వర్ధన్నపేట మండల పరిధిలోని కడారిగూడెం గ్రామంలో నిర్వహించే ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాలకు నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా, మండల, డివిజన్, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు కూడా హాజరై కార్యక్రమానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కరించాలి

## గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ & వర్కర్స్ యూనియన్ సిఐటియు



తెలుగు గళం న్యూస్, పర్వతగిరి / జూన్ 1

పర్వతగిరి మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎంపీడీవో శంకర్ నాయక్, ఎంపీ ఓ శేషాద్రిగారికి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు మండల అధ్యక్షులు నకరకంటి రామచందర్ మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలు రోగాల బారి నుండి కాపాడుతున్నటువంటి పంచాయతీ కార్మికులను అటువంటి పారిశుద్ధ కార్మికులను ఏళ్ల తరబడి పని చేసిన పని భద్రత లేకుండా పోయిందని రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చేసిన ప్రకటన రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటన ప్రకారం కార్మికులకు చెల్లించే వేతనాలను గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని పర్మినెంట్ కనీస వేతనాలు పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని 2018 సంవత్సరంలో గత రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ సిబ్బందికి నష్టదాయకంగా తీసుకొచ్చిన జీవో నెంబర్ 51 సవరించి వందలాదిమంది పంచాయతీ కార్మికులు చావుతోనైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరవాలని ఈ చావులకు కారణమైన మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని మరణించిన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం కల్పించాలని పంచాయతీ కార్మికులకు 10 లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని కారోబార్ బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని గ్రామపంచాయతీ సిబ్బందికి ఒకటవ తేదీన వేతనాలు చెల్లించాలని ప్రభుత్వానికి తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందించారు ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షులు నకరకంటి రామచందర్, మండల ఉపాధ్యక్షులు భాష, మండల ప్రధాన కార్యదర్శి రాజసాగర్, కార్యదర్శి రజిని బాబు, శ్రీకాంత్, జిల్లా సభ్యులు మౌనిక, కళా,నీల, లక్ష్మణ్, ప్రభాకర్,కొమురమ్మ రంగమ్మ, మంజుల, రమ సమ్మయ్య,మహేందర్,వెంకన్న తారమ్మ, చంద్రకళ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# బంజరు మాటు అభివృద్ధికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరికి కృతజ్ఞతలు తెలిపిన పాముసూర్ గ్రామ రైతులు



తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ జూన్ 01

స్టేషన్ ఘనపూర్ మండలం పాముసూర్ గ్రామ రైతులు హన్మకొండలోని ఎమ్మెల్యే నివాసంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. దశబ్దాలుగా ఎదురు చూస్తున్న బంజరు మాటు అభివృద్ధికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే గారికి రైతులు, గ్రామ. ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బంజరు మాటు అభివృద్ధికి మంజూరు అయిన 1కోటి 92లక్షల ప్రొసీడింగ్ కాపీని రైతులకు అందజేశారు. వీలైనంత తొందరలో పనులు పూర్తి చేయించి పాముసూరు గ్రామ రైతులకు రెండు పంటలకు సాగు నీరు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాముసూర్ గ్రామ రైతులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# త్యాగాలు ఒకరివైతే రాజ భోగాలు మరొకరివా?

**జూన్ 2 న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సామాజిక తెలంగాణ సాధనకై పోరాడేందుకు ప్రతిన బూనాలి**

**బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు**



**తెలుగు గళం న్యూస్, పర్వతగిరి / జూన్ 1 :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సుదీర్ఘంగా జరిగిన పోరాటాలలో త్యాగాలు చేసిన వారు ఒకరైతే భోగాలు అనుభవిస్తున్నది మరొకరిని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. 1969 తొలి దశ ఉద్యమంలో 360 మందికి పైగా ముక్కు పచ్చలారని యువ కిశోరాలు నేల కొరిగారని, మలిదశ ఉద్యమంలో 1200 కు పైగా ప్రాణ త్యాగం చేశారనన్నారు. 1946- 48 వరకు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, దొరల భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగు వేలకు మందికి పైగా అమరులైనారని గుర్తు చేశారు. ఆ పోరాటంలో తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య అయితే, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన తొలి దశ పోరాటంలో మార్కండేయ, మలిదశ పోరాటంలో శ్రీకాంత్ చారి, ఈ అన్ని పోరాటాలలో బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ బడుగు బలహీనవర్గాలకు చెందిన వారే ముందు వరసలో ఉన్నారని, త్యాగాలు చేశారని గుర్తు చేశారు. అశేష త్యాగాల ఫలితంగా సాధించిన తెలంగాణ రాష్ట్రంలో రాజ్యాధికారం అగ్రవర్ణాల చేతిలో బందీ అయిందన్నారు. పోరాటాలలో త్యాగాలలో ముందు వరుసలో ఉన్న బడుగు బలహీన వర్గాల వారికి రాజ్యాధికారం అందని ద్రాక్ష గానే మిగిలిందన్నారు. ఇటీవల కాలంలో జరుగుతున్న బీసీ ఉద్యమాల ఫలితంగా బీసీ వర్గాల్లో రాజకీయ చైతన్యం పెరుగుతున్నదని అందుకు ఇటీవల జరిగిన స్థానిక పంచాయితీ మరియు మున్సిపల్ ఎన్నికల్లో సాధించని ఘన విజయాలే నిదర్శనం అన్నారు. ఆ ఒరవడిని కొనసాగిస్తూ రానున్న కాలంలో బీసీలంతా రాజకీయాల కతీతంగా చట్టసభల్లో రిజర్వేషన్ తో పాటు ఆర్థిక సామాజిక విద్య వైద్య రంగాల్లో మేము ఎంతో మాకు అంత నినాదంతో పోరాడాలని, అంతిమంగా రాజ్యాధికారాన్ని సాధించాలన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత వచ్చిన గత ప్రభుత్వం గానీ, ఈనాడున్న ప్రభుత్వం కానీ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం లో విఫలమైనాయన్నారు. నిరుద్యోగం అధిక ధరలు అవినీతి విలయతాండవ మాడుతున్నదన్నారు. రైతుల , కార్మికుల, చేతి వృత్తిదారుల, మహిళల, విద్యార్థి యువకుల అన్ని వర్గాల ప్రజల సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు అమలు పరచకుండ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో జూన్ 2న జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర 13 వ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి ఊరూర,వాడ వాడలో జరిగే కార్యక్రమాలలో ప్రజలంతా పాల్గొని సామాజిక తెలంగాణ సాధన కోసం ప్రతిన బూనాలని వెంకట్రాములు పిలుపునిచ్చారు.

# జనగణన విజవంతానికి ప్రతి ఒక్కరు సహకరించాలి

**గృహ గణన విధానం అత్యంత కీలకం-**

**సోమారం & జామల పురం లో గృహ గణన ఏనుమరేషన్**

**పరిశీలనచేసిన పర్వతగిరి తహసీల్దార్ వెంకటస్వామి**



**తెలుగు గళం న్యూస్, పర్వతగిరి / జూన్ 1 :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం సోమారం జమాల్ పురం గ్రామాల్లో నిర్వహించే సెన్సెస్ 2027 గృహ గణన జనగణన ప్రక్రియలో స్వీయ గణన విధానం అత్యంత కీలకమని, ప్రజలు స్వయంగా తమ కుటుంబ వివరాలను సరైన విధంగా ఇంటికి వచ్చే ఏనుమరేషన్ తో చేసుకోవడం ద్వారా ఖచ్చితమైన గణాంకాలు సేకరించబడతాయని , ప్రతి కుటుంబం జనగణన సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని సూచించారు. ఖచ్చితమైన సమాచారం అందించడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయడానికి అవకాశం ఉంటుందని

పర్వతగిరి తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ విధానాన్ని గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ప్రతి పౌరుడి పై ఉందని ఆయన పేర్కొన్నారు. గృహ గణనపై విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

# అన్నారం షరీఫ్ అభివృద్ధికి సహకరించండి

**ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు సర్పంచ్ వినతి**



**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/జూన్ 1**

వరంగల్ జిల్లా: పర్వతగిరి, అన్నారం షరీఫ్ గ్రామ అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా చేసుకుని కీలక భూమిక పోషించాలని గ్రామ సర్పంచ్ గాడిపెల్లి మహేందర్ వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజును కోరారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు అనిల్ రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నాగరాజును కలిసిన సర్పంచ్ బృందం, షరీఫ్ దర్గాకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించింది. గ్రామం, దర్గా అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే నాగరాజు, అన్నారం గ్రామం, దర్గా అభివృద్ధికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు గొడుగు రమేష్, మండల యూత్ అధ్యక్షుడు గొడుగు వినయ్, వార్డు సభ్యులు గాడిపెల్లి రాజబాబు, రాపోలు అనిత-రవీందర్, గ్రామ నాయకులు గొల్లపల్లి సంతోష్, రామస్వామి, కృష్ణమోహన్, మోటపోతుల సారంగపాణి, తిరగని అఖిల్, ఇరగని మధుకర్, కాజా పాషా తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రగతికి కేసీఆర్ చిరునామా

- **రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ఎర్రబెల్లి దయాకర్ రావు**



**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/జూన్ 1**

వరంగల్ జిల్లా:పర్వతగిరి,తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం (జూన్ 2) సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు,తెలంగాణ బిడ్డలందరికీ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలోనే రాష్ట్రం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర సాధన పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నివాళులు అర్పించాలని పిలుపునిచ్చారు.ప్రగతి పథంలో తెలంగాణ: దశాబ్దాల పాటు సాగిన అణచివేతపై పోరాడి, అనేక ఆటుపోట్లను అధిగమించి శాంతియుత, ప్రజాస్వామ్య పంథాలో స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామని తెలిపారు. ఉమ్మడి పాలనలో తీవ్ర వివక్షకు గురైన తెలంగాణను స్వయం పాలనలో దేశానికి దిక్సూచిగా మార్చామని, 'పరిపాలన చేతకాదు' అని విమర్శించిన వారి నోళ్లు మూతపడేలా కేసీఆర్ ప్రగతి పాలన అందించారని అన్నారు.నూతన రాష్ట్రంగా ఏర్పడిన పదేండ్లలోనే సకల జనుల సంక్షేమం, సమస్త రంగాల సమగ్ర ప్రగతిని సాధించి తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దామని వివరించారు. సాగునీరు, తాగునీరు, విద్యుత్, వ్యవసాయం, విద్య, వైద్యం, సంక్షేమ రంగాల్లో తెలంగాణ సాధించిన ప్రగతి యావత్ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఒకనాడు ఎడారిలా మారిన తెలంగాణను కోటి ఎకరాల మాగాణంగా మార్చి, అన్నపూర్ణగా తీర్చిదిద్దిన ఘనత పదేండ్ల కేసీఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.అప్రమత్తంగా ఉండాలి: ప్రగతికి చిరునామాగా మారిన తెలంగాణ అస్తిత్వం తిరిగి మరోసారి ప్రమాదంలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఎర్రబెల్లి హెచ్చరించారు. విపత్కర శక్తుల నుంచి తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ తెలంగాణకు రక్షణ కవచంగా కేసీఆర్ నిలుస్తారని పునరుద్ఘాటించారు.స్వరాష్ట్ర సాధనలో, పదేండ్ల పునర్నిర్మాణంలో చూపిన స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధితో అమలు చేసి వారిలో విశ్వాసం నింపాల్సిన బాధ్యత ప్రస్తుత పాలకులపై ఉందని తెలిపారు. రైతాంగం, శ్రమజీవులు, సబ్బండ వర్గాల జీవితాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండాలని ఆకాంక్షించారు.

# ఆకేరు వాగులో యథేచ్ఛగా ఇసుక దందా

**ప్రభుత్వ ఖజానాకు గండి**

**అసైన్డ్ భూముల్లో అక్రమ తవ్వకాలు: వాహనాలు సీజ్ చేయాలని డిమాండ్**

**రోళ్లకల్ వ్యక్తి ఇసుక దందాపై చర్యలు తీసుకోండి - కలెక్టర్‌కు విజ్ఞప్తి**



**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/జూన్ 1**

వరంగల్ జిల్లా: పర్వతగిరి మండలం రోల్లకల్ నారాయణపురం చెరువు సమీపంలోని తండాల పరిధిలో 374 సర్వే నంబర్ అసైన్డ్ భూముల్లో రోళ్లకల్‌కు చెందిన ఓ వ్యక్తి యథేచ్ఛగా సాగిస్తున్న అక్రమ ఇసుక రవాణాను వెంటనే నిలిపివేయాలని నారాయణపురం మాజీ సర్పంచ్ ఎర్రబెల్లి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, మండల కేంద్రంలోని 300కు పైగా ట్రాక్టర్ల డ్రైవర్లు, దినసరి కూలీలు ఇసుక రవాణాపైనే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. గత మూడు నెలలుగా రెవెన్యూ, పోలీస్ అధికారులు అందరి వాహనాల ఇసుక రవాణాను నిలిపివేయగా, కేవలం రోళ్లకల్‌కు చెందిన వ్యక్తి ట్రాక్టర్లను మాత్రం యథేచ్ఛగా నడిపించుకునేందుకు స్వేచ్ఛ ఎవరు ఇస్తున్నారని ప్రశ్నించారు. ఆకేరు వాగు నుంచి రోజూ పెద్ద ఎత్తున అక్రమంగా ఇసుక తరలిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నా ఏ అధికారి కూడా పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అసైన్డ్ భూముల్లో అక్రమంగా తవ్వకాలు జరిపి ఇసుక అమ్ముకుంటున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్, మైనింగ్ శాఖ, రెవెన్యూ,పోలీస్ శాఖ అధికారులు వెంటనే స్పందించి సంబంధిత వ్యక్తి వాహనాలను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మండల కేంద్రంలో ట్రాక్టర్ల డ్రైవర్లు, కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని ఎర్రబెల్లి వెంకటేశ్వరరావు హెచ్చరించారు.

**జూన్ 2 తెలంగాణ రాష్ట్ర**

# ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**తెలుగు గళం న్యూస్ నర్సంపేట జూన్ 1**

నర్సంపేట నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు నర్సంపేట నియోజకవర్గంలో మరియు ప్రతి గ్రామలలో జూన్ 2 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం భాగస్వాములైన ఉద్యమకారులకు మరియు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు నవతరం యువతరానికి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో పెద్ద ఎత్తున జరపాలి. ఈ సందర్భంగా నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి మండల కేంద్రం, గ్రామాల్లో, పట్టణాల్లో, మున్సిపాలిటీ పరిధిలో గులాబీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించి విజయవంతం చేయాల్సిందిగా బిఆర్ఎస్ పార్టీ శ్రేణులకు, ఉద్యమ కారులను కోరుతున్నాను.

# పెండింగ్ బిల్లులు చెల్లింపులపై నిరసన చేస్తున్న BRS నాయకుల అరెస్ట్




**తెలుగు గళం న్యూస్ నర్సంపేట జూన్ 1**

నర్సంపేటలో మాజీ సర్పంచుల బకాయిల చెల్లింపుల కోసం చేపట్టిన కార్యక్రమంలో పాల్గొన్న నాయకుల అరెస్టులను బీఆర్ఎస్ నాయకులు ఖండించుతు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడిచినా మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కొడాలి రవి, మాజీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, దాసురు నాయుడు, శ్రీనివాస్‌రెడ్డి, గుడిసెల రాంబాబు తదితరులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని పేర్కొన్నారు.

# మహావీర్ ఆస్పత్రిలో డాక్టర్ల నిర్లక్ష్యం



**తెలుగు గళం,వికారాబాద్:** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మహావీర్ ఆస్పత్రిలో డాక్టర్ల ఘోర నిర్లక్ష్యం కారణంగా ఐదు నెలల పసికందు మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. నవాబుపేట మండలం మినపల్లి కాలన్ గ్రామానికి చెందిన జోగు మధుకర్, మౌనిక దంపతుల ఐదు నెలల కుమార్తె అస్వస్థతకు గురికావడంతో, రాత్రి 2 గంటల సమయంలో వైద్యం కోసం మహావీర్ ఆస్పత్రికి తరలించారు. అయితే, అత్యవసర సమయం అయినప్పటికీ ఉదయం 4 గంటల వరకు అక్కడి వైద్యులు కనీసం పట్టించుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో ఉన్న జూనియర్, ట్రైనీ డాక్టర్లు కనీస బాధ్యత లేకుండా సెల్ ఫోన్లలో సీనియర్ డాక్టర్లతో మాట్లాడుతూ వైద్యం అందించారని, వారి ఫోన్ల నిర్లక్ష్యం వల్లే తమ కూతురు ప్రాణాలు కోల్పోయిందని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. దీనికి తోడు డాక్టర్లు రాసిచ్చిన మందుల కోసం వెళ్తే, 24 గంటల ఎమర్జెన్సీ అని బోర్డులు పెట్టుకున్న ఆస్పత్రిలోని మెడికల్ దుకాణం మూసి ఉందని, దుకాణం సిబ్బందిని లేపడానికి అరగంటకు పైగా సమయం పట్టిందని మండిపడ్డారు. పసిపాప మృతికి కారణమైన డాక్టర్లపై, మెడికల్ దుకాణం నిర్వాహకులపై తక్షణమే కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని స్థానిక వార్డు మెంబర్ కావాలి శేఖర్ మరియు ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని తీవ్రంగా డిమాండ్ చేశారు. పాప మృతిపై ఆస్పత్రి యాజమాన్యాన్ని, బాధ్యులైన డాక్టర్లను ప్రశ్నిస్తే.. “ఏం చేసుకుంటారో చేసుకోండి, ఇట్లాగే అయితది” అంటూ బేధ్యతాయుతంగా, దురహంకారంతో సమాధానం ఇచ్చారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద ప్రజలకు ఉచితంగా నాణ్యమైన చికిత్స అందిస్తామని రంగుల మాటలు చెప్పే మహావీర్ ఆస్పత్రిలో ఇలాంటి ఘోరాలు జరగడం ఇది మొదటిసారి కాదని, గతంలోనూ డాక్టర్ల నిర్లక్ష్యం వల్ల పలువురు ప్రాణాలు కోల్పోయారని స్థానికులు ఆరోపించారు. కార్పొరేట్ స్థాయిలో బోర్డులు తిప్పుకుంటూ కనీస బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్న మహావీర్ ఆస్పత్రి యాజమాన్యంపై, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ట్రైనీ డాక్టర్లపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వార్డు మెంబర్ కావాలి శేఖర్ మరియు ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.